క్లుప్తంగా

వైభవంగా బంగారమ్మ తల్లి తీర్థం



కొత్తవలస: దేశపాత్రుని పాలెంలో పూజలందు కుంటున్న బంగారమ్మతల్లి

కొత్తవలస: మండలంలోని దేశపాత్రునిపాలెం గ్రామంలో బంగారమ్మతల్లి తీర్థం బుధవారం వైభవంగా నిర్వహించారు. గ్రామస్తులు అమ్మవారికి కుంకుమ పూజలు, అర్చనలు, అభిషేకాలు చేశారు. తీర్థం సందర్భంగా గ్రామపెద్దలు పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

వల్లంపూడిలో సాంబమూర్తి తీర్థం

వేపాడ: మండలంలోని వల్లంపూడిలో సాంబమూర్తి తీర్థం ఘనంగా నిర్వహించారు. స్వామివారికి ఉదయం నుంచి ప్రత్యేక పూజలు అభిషేకాలు చేశారు. సాయంత్రం శివాల యం వీధిలో నిర్వహించిన రంగవల్లుల పోటీల్లో మహిళలు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఉత్సవ కమిటీ ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

చేతిపంపులు ప్రారంభం

బొండపల్లి: మండలంలోని నెలివాడ గ్రామంలో పెరికి కులస్తులతో పాటు, ఎస్సీల శ్మశాన వాటికల్లో ఏర్పాటు చేసిన హ్యాండ్ బోర్లను వైఎస్సార్‌సీపీ మండల ఉపాధ్యక్షుడు తాళ్లపూడి అప్పలనాయుడు బుధవారం ప్రారంభించారు. రూ.1.35 లక్షల మండల పరిషత్ నిధులతో ఒక బోరును, 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.1.35 లక్షలతో మరొక బోరును ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

రహదారి భద్రతా వారోత్సవాలు



ర్యాలీలో పాల్గొన్న ఆర్టీసీ డిపో మేనేజర్ రమేష్, ఉద్యోగులు

శృంగవరపుకోట: రహదారి భద్రతా వారోత్సవాల్లో భాగంగా స్థానిక ఆర్టీసీ డిపోలో మేనేజర్ కె.రమేష్ ఆధ్వర్యంలో బుధవారం 'హ్యాపీ డ్రైవర్స్ డే' కార్యక్రమం నిర్వహించారు. డిపో మేనేజర్ డ్రైవర్లకు పుష్పగుచ్చాలు, స్వీట్లు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్రైవర్లు వాహనాన్ని నడిపేటప్పుడు ప్రశాంతంగా ఉండాలన్నారు. ప్రయాణికుల క్షేమమే కర్తవ్యంగా భావిస్తూ, రోడ్డు మీద దృష్టి కేంద్రీకరించి పనిచేయాలన్నారు.అనంతరం సుమారు 70 మంది సిబ్బందితో ఎస్.కోట పట్టణ ప్రధాన రహదారిలో ర్యాలీ చేశారు. విజయనగరం రీజియన్ ఎస్‌డీఐ సీహెచ్.వేణు, ట్రాఫిక్ సూపరింటెండెంట్ వెంకటరావు పాల్గొన్నారు.

ఓటు వినియోగంపై అవగాహన

చీపురుపల్లిరూరల్(గరివిడి): ఈవీఎం(ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషిన్)లో ఓటు హక్కు వినియోగించు కునే విధానంపై స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ప్రజలు, ప్రజాప్రతినిధులకు తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది బుధవారం అవగాహన కల్పించారు. ఈవీఎంలో ఓటు వేసిన తర్వాత ఏగుర్తుకు పడిందో చూపిస్తూ వీవీప్యాట్(ఓటర్ వెరిఫైడ్ పేపర్ ఆడిట్ ట్రయల్)యంత్రంలో స్లిప్ డిస్‌ప్లే అవుతుందని సిబ్బంది వివరించారు. ఎంపీడీఓ జి.భాస్కరరావు, జెడ్పీటీసీ వాకాడ శ్రీనివాసరావు, ఏఎంసీ మాజీ చైర్మన్ మీసాల విశ్వేశ్వరరావు, మాజీ ఎంపీపీ కొణిశ కృష్ణంనాయుడు, జేసీఎస్ కన్వీనర్ పొన్నాడ కుమార్, ఎంపీటీసీ పోలీస్‌నాయుడు, కొండపాలెం పంచాయతీ వైస్ సర్పంచ్ బమ్మిడి కార్తీక్, నాయకులు పి.కుమార్,కిరణ్ పాల్గొన్నారు.

నాలుగు ఇసుక ట్రాక్టర్లు సీజ్

గజపతినగరం: మండలంలోని పి.ఎస్.ఆర్.పురం గ్రామ సమీపంలో అక్రమంగా ఇసుక తరలిస్తున్న నాలుగు ట్రాక్టర్లను బుధవారం రాత్రి సీజ్ చేశామని స్థానిక ట్రైనీ డీఎస్పీ ఎస్.మహేంద్ర తెలిపారు. అలాగే ఇసుక తరలిస్తున్న వారిపై కేసు నమోదు చేశామని పేర్కొన్నారు.

ఆరోగ్యశ్రీ స్మార్ట్ కార్డుల పంపిణీ

గుర్ల: మండలంలోని జమ్మపేట గ్రామంలో పలు కుటుంబాలకు కొత్తగా వచ్చిన వైఎస్సార్ ఆరోగ్యశ్రీ స్మార్ట్ కార్డులను సర్పంచ్ కురుమునెల్లి వరలక్ష్మి బుధవారం పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆరోగ్యశ్రీ ద్వారా వైద్యం చేయించుకునేందుకు వ్యయ పరిమితిని రూ.25లక్షల వరకు పెంచి పేదల ఆరోగ్యానికి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి భరోసా కల్పించారని అన్నారు. సచివాలయ, వైద్యసిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

ఇద్దరి అరెస్ట్

లక్కవరపుకోట: మండలంలోని నర్సంపేట గ్రామ సమీపంలో నిర్వహిస్తున్న కోడిపందేల శిబిరంపై ఎస్‌ఐ ఆర్.గోపాలరావు ఆధ్వర్యంలో పోలీసులు బుధవారం దాడి చేశారు. ఇద్దరు నిర్వాహకులను అదుపులోకి తీసుకొని వారి నుంచి 5 కోడి పుంజులు, రూ.650 నగదు స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేశామని ఎస్‌ఐ తెలిపారు.

వ్యక్తిపై కేసు నమోదు

దత్తిరాజేరు: మండలంలోని చెరుకుపల్లి గ్రామానికి చెందిన వ్యక్తి బుధవారం అక్రమంగా మద్యం తరలిస్తుండగా ఆర్.రామచంద్రాపురం వద్ద అదుపులోకి తీసుకున్నామని ఎస్.భూర్జవలస ఎస్‌ఐ లక్ష్మీప్రసన్నకుమార్ తెలిపారు. నిందితుడి నుంచి 8 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేశామని పేర్కొన్నారు.

మహిళల్లో 'సంక్షేమ' వెలుగులు



వైఎస్సార్ ఆసరా సంబరాల్లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య

- మహిళలంటే ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డికి అంతులేని అభిమానం
- అతివల ఆర్థిక సంక్షేమానికి అనుగుణంగా పథకాలు
- ఇచ్చిన మాట ప్రకారం డ్వాక్రా మహిళల రుణాలు మాఫీ చేశారు
- ఎన్నికల వేళ మోసం చేసేందుకు వస్తున్న టీడీపీ నేతలను నమ్మొద్దు
- కొఠారుబిల్లి కూడలిలో అట్టహాసంగా వైఎస్సార్ ఆసరా సంబరాలు
- పాల్గొన్న గజపతినగరం ఎమ్మెల్యే అప్పలనరసయ్య, ఎంపీ బెల్లాన, ఎమ్మెల్సీలు సురేష్‌బాబు, రఘురాజు

గంట్యాడ: మహిళల ఆర్థిక సంక్షేమానికి నాలుగున్నరేళ్లుగా పలు పథకాలు అమలు చేస్తున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి అండగా నిలవాలంటూ గజపతినగరం ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య పిలునిచ్చారు. గంట్యాడ మండలం కొఠారుబిల్లి కూడలి వద్ద బుధవారం నిర్వహించిన వైఎస్సార్ ఆసరా సంబరాలు అట్టహాసంగా సాగాయి. వేలాది మంది మహిళల రాకతో కొఠారుబిల్లి కూడలి జన జాతరను తలపించింది. ఇచ్చిన మాట ప్రకారం డ్వాక్రా రుణాలు మాఫీ చేయడంతో మహిళలు చిరునవ్వులు చిందించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య మాట్లాడుతూ ఇచ్చిన మాటమీద నిలబడే వ్యక్తి ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి అని పేర్కొన్నారు. ప్రతి పిల్లవాడు చదువుకోవాలన్న ఉద్దేశంతో అమ్మఒడి, జగన విద్యాకానుకలను అందజేస్తున్నారన్నారు. పేద పిల్లలు చదువుకునే ప్రభుత్వ బడులను నాడు-నేడు నిధులతో సుందరంగా తీర్చిదిద్దారన్నారు. అంతర్జాతీయ స్థాయిలో ఆంధ్రా విద్యార్థులు రాణించేలా ఇంగ్లిష్ మాధ్యమాన్ని అందుబాటులోకి తెచ్చారన్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో చంద్రబాబు విద్యను వ్యాపారం చేసేశారని, ప్రభుత్వ బడులను నిర్వీర్యం చేశారని విమర్శించారు. చంద్రబాబు జీవితం అంతా మోసపూరితమన్నారు. ధన వంతుల అభివృద్ధి కోసం చంద్రబాబు ప్రయత్నిస్తారని, జగన్ మోహన్ రెడ్డి పేదల అభివృద్ధికి పాటుపడుతున్నారని, ఎవరి పక్షాన నిలస్తే బాగుంటుందో ప్రజలే ఆలోచన చేయాలన్నారు. మహిళా సంక్షేమానికి పాటు పడుతున్న సీఎం జగన్ మోహన్ రెడ్డికి మహిళలు అంతా అండగా నిలవాలని కోరారు. అనంతరం 14,935 మంది డ్వాక్రా మహిళలకు రూ 9. 23 కోట్ల చెక్కును అందజేశారు.

☛ విజయనగరం ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ మాట్లాడుతూ చంద్రబాబునాయుడు దిగిపోతూ డ్వాక్రా మహిళలకు రూ.25 వేల కోట్ల అప్పులు మిగిల్చాడన్నారు. 2014 ఎన్నికల్లో గెలిపిస్తే డ్వాక్రా రుణాలు మాఫీ చేస్తానని చెప్పి మహిళలను మోసం చేశాడన్నారు. అవకాశం ఇస్తే డ్వాక్రా రుణాలు నాలుగు విడతల్లో మాఫీ చేస్తానని సీఎం వై.ఎస్.జగన్ మోహన్ రెడ్డి చెప్పారని, ఇచ్చిన మాటను నేడు నెరవేర్చారన్నారు. చంద్రబాబు, పవన్‌లు పేదలకు ఇళ్లు, స్థలాలు రాకుండా కోర్టులకు వెళ్లి అడ్డుకుంటున్నారని ఆరోపించారు. జగన్ మోహన్ రెడ్డిని మరోసారి సీఎం చేస్తే మరిన్ని సంక్షేమ పథకాలు అమలు చేస్తారని చెప్పారు.

☛ ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి మహిళా పక్షపాతి అని ఎమ్మెల్సీ సురేష్ బాబు అన్నారు. పాదయాత్ర సమయంలో మహిళలు కష్టాలు తెలుసుకుని అధికారంలో వచ్చిన వెంటనే వారి కోసం సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని చెప్పారు. చంద్రబాబు పాలనను, జగన్ మోహన్ రెడ్డి పాలనను ప్రజలు బేరీజు వేసుకోవాలన్నారు. దేశంలో ఎక్కడ లేని విధంగా రూ. 3 వేలు పింఛన్ ఆంధ్రప్రదేశ్‌లో మాత్రమే ఇస్తున్నట్టు వెల్లడించారు.

☛ దేశంలో ఏ రాష్ట్రంలో ఇవ్వని విధంగా మహిళల ఆర్థికోన్నతికి సీఎం జగన్‌మోహన్ రెడ్డి కృషి చేస్తున్నారని ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు అన్నారు. ఏ అన్నదమ్ముడు తన అక్కచెల్లెమ్మలకు ఇవ్వనివిధంగా వైఎస్సార్ చేయూత కింద ఏటా రూ.18,750 ఇస్తున్నది జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమేనని తెలిపారు. సమావేశంలో ఎంపీపీ పీరుబండి హైమావతి, జెడ్పీటీసీ సభ్యుడు వర్రి నరసింహమూర్తి, వైఎస్సార్ సీపీ జిల్లా ఎస్సీసెల్ అధ్యక్షుడు పీరుబండి జైహింద్‌కుమార్, ఏఎంసీ చైర్మన్ వేమలి ముత్యాలనాయుడు, పార్టీ మండలాధ్యక్షుడు రంధి రామునాయుడు, జేసీఎస్ కన్వీనర్ రామసూర్యం, వైఎస్సార్ సీపీ నాయకులు నారాయణమూర్తిరాజు, పి.నారాయణమూర్తి, కె.కొండలరావు, కొడెల ముత్యాలనాయుడు, గనివాడ సన్యాసినాయుడు, లచ్చి రెడ్డికృష్ణ, డీఆర్‌డీఏ పీడీ వాసుదేవరావు, ఎంపీడీఓ భవానీ, తహసీల్దార్ నీలకంఠేశ్వరరెడ్డి, వెలుగు ఏపీఎం శ్రీనివాస్ పాల్గొన్నారు.



సమావేశానికి హాజరైజన డ్వాక్రా మహిళలు

రూ.40 వేల రుణం మాఫీ



నేను గిరిజన ప్రాంత మహిళను. నాలుగు విడతల్లో రూ.40 వేలు రుణం మాఫీ అయ్యింది. అన్ని పథకాలు మా పేరు తోనే అందుతున్నాయి. కుటుంబానికి అండగా ఉన్నాం. చాలా సంతోషంగా ఉంది.

– కొండమ్మ, డి.కె.పర్తి, డ్వాక్రా మహిళ

పోలింగ్ కేంద్రాల్లో అన్ని సౌకర్యాలు ఉండాలి

- కలెక్టర్ నాగలక్ష్మి



చీపురుపల్లి: విజయరాంపురంలోని పోలింగ్ బూత్ వద్ద అధికారులకు సూచనలు చేస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి

చీపురుపల్లి: పోలింగ్ కేంద్రాల్లో పూర్తిస్థాయిలో సౌకర్యాలు ఉండాలని జిల్లా కలెక్టర్ ఎస్. నాగలక్ష్మి అధికారులను ఆదేశించారు. మండలంలోని రావివలస పంచాయతీలోని విజయరాంపురం ప్రాథమిక పాఠశాలలో పోలింగ్ బూత్‌ను బుధవారం ఆమె సందర్శించారు. కేంద్రంలో విద్యుద్దీకరణ, తాగునీరు, టాయిలెట్స్‌ను పరిశీలించారు. ప్రతీ పోలింగ్ బూత్‌లోనూ అన్ని సదుపాయాలు ఉండాలని లేకపోతే తక్షణమే ఏర్పాటు చేయాలని సూచించారు. ఓటర్ల జాబితాలను మరోసారి సరి చూసుకోవాలని బీఎల్‌ఓలను ఆదేశించారు. మండలంలో ఉన్న అన్ని పోలింగ్ కేంద్రాలను తహసీల్దార్, ఎంపీడీఓ పరిశీలించాలని, ఎక్కడైన సరైన సదుపాయాలు లేకుంటే తక్షణమే ఏర్పాటు చేయాలన్నారు. కలెక్టర్ వెంట ఆర్డీఓ బి.శాంతి, తహసీల్దార్ ఎం.సురేష్, ఎంపీడీఓ జి.గిరిబాల, ఎన్నికల డీటీ సురేష్ తదితరులు ఉన్నారు.

కోడూరులో..

చీపురుపల్లిరూరల్(గరివిడి): గరివిడి మండలంలోని కోడూరు పోలింగ్ బూత్‌ను జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి బుధవారం సందర్శించారు. కేంద్రంలో తాగునీరు, విద్యుత్, ఇతర సదుపాయాలను పరిశీలించారు. ఆమె వెంట ఆర్డీఓ శాంతి,తహసీల్దార్ టి.గోవింద్ తదితరులు ఉన్నారు.

కోమటిపల్లిలో వైద్యశిబిరం

దత్తిరాజేరు: మండలంలోని కోమటిపల్లి గ్రామంలో 104 సిబ్బంది బుధవారం వైద్య శిబిరం నిర్వహించారు. ఈశిబిరంలో దత్తిరాజేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి ఆనంద్‌కుమార్ సిబ్బందితో కలిసి 98 మందికి వివిధ వైద్యపరీక్షలు చేశారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. అనంతరం గృహసందర్శన చేసి శిబిరం వద్దకు రాలేని వృద్ధులు, బెడ్ రెస్ట్ రోగులకు షుగర్, బీపీ తదితర పరీక్షలు చేసి, వైద్యసేవలందించారు.

ఇరువర్గాలపై కేసులు నమోదు

వేపాడ: మండలంలోని అరిగిపాలెం గ్రామంలో సోమవారం రాత్రి చుక్కమాంబ తీర్థంలో జరిగిన గొడవలకు సంబంధించి ఇరువర్గాలపై కేసు నమోదు చేశామని వల్లం పూడి ఎస్‌ఐ రాజేష్ తెలిపారు. బీసీలు, ఎస్సీల మధ్య జరిగిన గొడవలో ఇరువర్గాలు చేసిన ఫిర్యాదు మేరకు చెరో 30 మందిపై కేసులు నమోదు చేశామని ఆయన చెప్పారు.

ప్రతిభను వెలికితీసేందుకే.. 'ఆడుదాం-ఆంధ్రా' పోటీలు

- నియోజకవర్గస్థాయి పోటీలు ప్రారంభం




చీపురుపల్లి-గరివిడి మహిళల జట్ల మధ్య వాలీబాల్ మ్యాచ్

చీపురుపల్లి: గ్రామీణ ప్రాంత యువతలో దాగి ఉన్న క్రీడా ప్రతిభను వెలికి తీసేందుకు ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి 'ఆడుదాం-ఆంధ్రా' పేరుతో క్రీడా పోటీలు నిర్వ హిస్తున్నారని ఎంపీపీ ఇప్పిలి వెంకటనర్సమ్మ చెప్పారు. స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల మైదానంలో నియోజకవర్గస్థాయి 'ఆడుదాం-ఆంధ్రా' పోటీలను ఎంపీపీ బుధవారం ప్రారంభించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ క్రీడలు మానసిక ఉల్లాసం, శారీరకదృఢత్వానికి దోహదపడతాయని, క్రీడల్లో రాణించేవారికి ఉజ్వల భవిష్యత్ ఉంటుందన్నారు. క్రీడలను ప్రోత్సహించడమే ధ్యేయంగా ప్రభుత్వం 'ఆడుదాం-ఆంధ్రా' పేరుతో రాష్ట్ర వ్యాప్తంగా వాలీబాల్, కబడ్డీ, క్రికెట్, ఖోఖో, బ్యాడ్మింటన్ క్రీడా పోటీలు నిర్వహిస్తోందన్నారు. సచివాలయం స్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు ఈ పోటీలు జరుగుతున్నాయని చెప్పారు. ఇప్పటికే సచివాలయ స్థాయిలో విజేతలుగా నిలిచిన వారంతా మండలస్థాయి పోటీల్లో ఆడారని అక్కడ విజేతలుగా నిలిచిన వారంతా నియోజకవర్గ స్థాయి పోటీలకు వచ్చారన్నారు. నియోజకవర్గస్థాయి విజేతలు జిల్లా స్థాయి అక్కడి నుంచి రాష్ట్రస్థాయి పోటీలకు వెళతారన్నారు. జిల్లా,రాష్ట్రస్థాయి పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనపరిచి చీపురుపల్లి నియోజకవర్గం పేరును ఇనుమడింపజేయాలని కోరారు. చీపురుపల్లి మేజర్ పంచాయతీ సర్పంచ్ మంగళగిరి సుధారాణి, వైఎస్సార్‌సీపీ నాయకులు ఇప్పిలి అనంతం, వలిరెడ్డి శ్రీనివాసనాయుడు, పతివాడ రాజారావు, దాలయ్య, మంగళగిరి శ్రీను, ఎంపీడీఓ కార్యాలయ ఏఓ ప్రవీణ్, పాఠశాల హెచ్‌ఎం చంద్రశేఖర్, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



వాలీబాల్ పోటీలు ప్రారంభిస్తున్న ఎంపీపీ వెంకటనరసమ్మ



శృంగవరపుకోట: వరలక్ష్మి పీఈటీ కాలేజ్ మైదానంలో క్రీడా పోటీలకు చేస్తున్న ఏర్పాట్లు

పోటీలకు సిద్ధం..

శృంగవరపుకోట: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న రాష్ట్రవ్యాప్త క్రీడా టోర్నమెంట్ 'ఆడుదాం-ఆంధ్రా' పోటీలు మూడోస్థాయికి చేరుకున్నాయి. సచివాలయాలు, మండలస్థాయి పోటీల అనంతరం మండల స్థాయి విజేతలకు నియోజకవర్గస్థాయి పోటీలు గురువారం నుంచి నిర్వహించేందుకు అధికారులు అంతా సిద్ధం చేశారు. నియోజకవర్గ క్రీడల కో-ఆర్డినేటర్ కె.కృష్ణంరాజు, ఎస్.కోట ఎంపీడీఓ శేషుబాబు నేతృత్వంలో ఈపోటీలు జరగనున్నాయి. అయిదు మండలాల్లో విజేతలు అంతా ఈ పోటీల్లో తలపడనున్నారు గురువారం ఉదయం 9.30 గంటలకు పురు షులకు కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ పోటీలను పట్టణంలోని డాక్టర్ వరలక్ష్మి ఫిజికల్ ఎడ్యుకేషన్ కాలేజ్ గ్రౌండ్‌లో, క్రికెట్, బ్యాడ్మింటన్ పోటీలు ఉదయం 8.30గంటలకు ఎస్.కోట ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడామైదానంలో నిర్వహించనున్నారు. 27న ఉదయం 9.30 గంటలకు మహిళల కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ పోటీలు డాక్టర్ వరలక్ష్మి ఫిజికల్ ఎడ్యుకేషన్ కాలేజ్‌లో, అలాగే స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడామైదానంలో 27న ఉద యం ఉదయం 8.30గంటలకు బ్యాడ్మింటన్ పోటీల నిర్వహణకు ఏర్పాట్లు చేశారు.



మెంటాడ(గజపతినగరం రూరల్): 'ఆడుదాం-ఆంధ్రా' పోటీల నిర్వహణపై సిబ్బందితో సమీక్షిస్తున్న ఎంపీడీఓ కిశోర్‌కుమార్

క్రీడా పోటీల ఏర్పాట్లపై సమీక్ష

మెంటాడ(గజపతినగరం రూరల్): గజపతి ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదనాంలో గురువారం ప్రారంభంకానున్న నియోజకవర్గస్థాయి 'ఆడుదాం-ఆంధ్రా' పోటీలకు సంబంధించిన ఏర్పాట్లుపై ఎంపీడీఓ కిశోర్‌కుమార్ తన కార్యాలయంలో అధికారులతో సమీక్షించారు. పోటీలను ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య ప్రారంభిస్తారని చెప్పారు. క్రీడాకారులకు ఇబ్బందులు కలగకుండా అన్ని వసతులు కల్పించాలని అధికారులను ఆదేశించారు. ఈఓపీఆర్డీ జనార్దనరావు, పురిటిపెంట పంచాయతీ కార్యదర్శి జనార్దన్, ఎంపీడీఓ కార్యాలయ ఏఓ సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

ఆడపిల్లలను రక్షిద్దాం.. చదివిద్దాం



శృంగవరపుకోట: వెంకటరమణపేటలో బాలికలతో కలిసి ర్యాలీ చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

శృంగవరపుకోట: ఆడపిల్లలను రక్షిద్దాం.. వారిని చదివిద్దామని వెంకటరమణపేట గ్రామంలోని అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు అన్నారు. జాతీయ బాలికా దినోత్స వంలో భాగంగా బుధవారం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఆడపిల్లలను రక్షిద్దాం- భవిష్యత్‌ను కాపాడుదాం, ఆడపిల్ల చదువు -అందరికీ వెలుగు. ఆడపిల్లలని చదివిద్దాం- సమాజాభివృద్ధిని స్వాగతిద్దాం' అంటూ నినాదాలు చేశారు. అనంతరం గ్రామంలో నాలుగు అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలు, వారి తల్లులను ఒకచోట సమావేశ పరిచి, ఆడపిల్లల రక్షణ, పెంపకం, వారి ఆరోగ్యం, ఆహారం విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఆడపిల్లలకు ఎదురయ్యే ఆరోగ్య సమస్యలు వాటికి పరిష్కారాలను సూచించారు. కార్యక్రమంలో క్రాంతి, శ్రీదేవి, పుష్ప, మాధవి పాల్గొన్నారు.

అవకాశాలను అందిపుచ్చుకోవాలి



చీపురుపల్లి: వ్యాసరచన, వకృత్వ పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేస్తున్న పీడీ రాజేశ్వరి

చీపురుపల్లి: బాలికలకు ప్రభుత్వం కల్పిస్తున్న విద్యావకాశాలను అందిపుచ్చుకుని భవిష్యత్‌లో ఉన్నత శిఖరాలకు ఎదగాలని ఐసీడీఎస్ పీఓ రాజేశ్వరి చెప్పారు. పట్టణంలోని కస్తుర్బా గాంధీ బాలికల విద్యాలయంలో జాతీయ బాలికల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా విద్యార్థినులకు వ్యాసరచన, వకృత్వం పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో చీపురుపల్లి, మెట్టపల్లి ఐసీడీఎస్ సెక్టార్ల సూపర్‌వైజర్లు టి.కృష్ణవేణి, జె.పైడిమంగమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఓటు హక్కు ఎంతో విలువైనది

- విద్యార్థులకు వ్యాసరచన,వకృత్వ, చిత్రలేఖన పోటీలు



గజపతినగరం: వ్యాసరచన పోటీలను పర్యవేక్షిస్తున్న ఎంఈఓలు విమలమ్మ, సాయిచక్రధర్



కొత్తవలస: బహుమతులు అందుకున్న విద్యార్థులతో ఎంఈఓలు శ్రీదేవి,శ్రీనివాసరావు తదితరులు

కొత్తవలస: ప్రజాస్వామ్యవ్యవస్థలో ఓటు హక్కు చాలా విలువైందని ఎంఈఓలు జి.శ్రీదేవి,బండారు శ్రీనివాసరావు అన్నారు. జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా స్థానిక మండల విద్యావనరుల కేంద్రంలో పలు పాఠశాలల విద్యార్థులకు 'ఓటు హక్కు ఆవశ్యకత'పై బుధవారం అవగాహన కల్పించారు. అలాగే వ్యాసరచన, వకృత్వ, డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు. ప్రథమ,ద్వితీయ,తృతీయ స్థానాల్లో నిలిచిన విద్యార్థులకు తహసీల్దార్ శ్రీనివాసమిశ్ర ఆర్థిక సహాయంతో బహుమతులు అందజేసారు.ఆర్‌ఐ రాజేష్,పలు పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గజపతినగరంలో..

గజపతినగరం: ఈనెల25న జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా మండల విద్యావనరుల కేంద్రంలో ఎంఈఓలు విమలమ్మ, సాయిచక్రధర్ ఆధ్వర్యంలో 'ఓటు ఆవశ్యకత' అనే అంశంపై పాఠశాలల విద్యార్థులకు బుధవారం వ్యాసరచన, వకృత్వ పోటీలు నిర్వహించారు. ఎంఈఓలు మాట్లాడుతూ పోటీల్లో ప్రథమ,ద్వితీయ,తృతీయ స్థానాల్లో నిలిచిన వారికి గురువారం బహుమతులు ప్రధానం చేయనున్నట్లు చెప్పారు. అనంతరం స్థానిక బాలుర హైస్కూల్‌లో విద్యార్థులకు ఓటు హక్కు, వినియోగం తదితర అంశాలపై అవగాహన కల్పించారు. విద్యార్థులు ఓట్ అక్షరాల ఆకారంలో కూర్చొని చేసిన ప్రదర్శన ఆకట్టుకుంది.



గజపతినగరం: గజపతినగరం బాలుర హైస్కూల్‌లో 'ఓట్' అక్షరాల ఆకారంలో విద్యార్థుల ప్రదర్శన

కొత్తవలస పోలీస్ సిబ్బందికి ప్రశంసాపత్రాలు



ఎస్పీ దీపికాపాటిల్ చేతుల మీదుగా ప్రశంసాపత్రం అందుకుంటున్న ఏఎస్‌ఐ యువరాజు

కొత్తవలస: స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఏఎస్‌ఐగా పనిచేస్తున్న టి.యువరాజు, కానిస్టేబుల్ రమేష్, హోంగార్డు ప్రసాద్‌కు జిల్లా ఎస్పీ ఎం.దీపికా పాటిల్ విజయనగరంలోని తన కార్యాలయంలో బుధవారం ప్రశంసాపత్రాలు అందజేశారు. గతేడాది డిసెంబర్-8వ తేదీన కొత్తవలస మండలం, చింతలపాలెం గ్రామ సమీపంలోని స్టేట్‌బ్యాంకు ఆఫ్ ఇండియాలో దొంగలు చొరబడి లాకర్, ఏటీఎంలను గ్యాస్ కట్టర్లతో కట్ చేశారు. సమాచా రం అందుకున్న ఏఎస్‌ఐ యువరాజు తన సిబ్బందితో కలిసి ఎనిమిది నిముషాల్లో అక్కడికి చేరుకున్నారు. పోలీసులు రావడంతో దొంగలు పరారయ్యారు. సకాలంలో స్పందించడం వల్ల సుమారు రూ.20లక్షలకు పైగా ఆస్తి రక్షించారు. ఈ కేసు విషయంలో సిబ్బంది స్పందించిన తీరును ఎస్పీ అభినందించి ప్రశంసాపత్రాలు అందజేశారు. వీరికి సీఐ వి.చంద్రశేఖర్,ఎస్ఐ బి.దేవి అభినందనలు తెలిపారు.

అభివృద్ధి పనులను వేగవంతం చేయండి



సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ మీసాల విజయలక్ష్మి

చీపురుపల్లిరూరల్(గరివిడి): అధికారులు అలసత్వం వహించకుండా గ్రామాల్లో చేపడుతున్న అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని ఎంపీపీ మీసాల విజయ లక్ష్మి అన్నారు. గరివిడి మండల పరిషత్ కార్యాలయంలో మండల సాధారణ సర్వసభ్య సమావేశం బుధవారం నిర్వహించారు. ముందుగా శాఖల వారీ గా చేపడుతున్న అభివృద్ధి పనుల ప్రగతి, సమస్యలపై అధికారులు,ఎంపీటీసీలు,సర్పంచులతో చర్చించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ జగనన్న కాల నీలతో పాటు సొంత స్థలాల్లో చేపడుతున్న ఇళ్ల నిర్మాణాలకు పెండింగ్ లేకుండా బిల్లులు మంజూరు చేయించి, త్వరగా నిర్మాణాలు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఇంకా ఎవరైనా ఇళ్లస్థలాలకు దరఖాస్తు చేసుకుంటే వారికి స్థలాలు మంజూరు చేయాలన్నారు. అసంపూర్తిగా ఉన్న ప్రభుత్వ భవనాలను పూర్తి చేయించాలని ఆదేశించారు. ఇంకా రైతుల వద్ద ధాన్యం మిగిలి ఉంటే వాటిని కూడా పూర్తిస్థాయిలో సేకరించాలని వ్యవసాయశాఖ అధికారు లకు సూచించారు. ఎంపీడీఓ జి.భాస్కరరావు, జెడ్పీటీసీ వాకాడ శ్రీనివాసరావు, వైస్ ఎంపీపీలు జి.వెంకటఅప్పలరాజు, గుడివాడ శ్రీరాములునాయుడు, ఏఎంసీ మాజీ చైర్మన్ మీసాల విశ్వేశ్వరరావు, మాజీ ఎంపీపీ కొణిశ కృష్ణంనాయుడు తదితరులు పాల్గొన్నారు.

నేడు వైఎస్సార్ ఆసరా సంబరాలు

జామి: మండల కేంద్రంలో వైఎస్సార్ ఆసరా సంబరాలు గురువారం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ ఎం.సతీష్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు ప్రారంభంకానున్న సంబరాలకు ఎమ్మెల్యే శ్రీనివాసరావు అతిథిగా హాజరవుతారని పేర్కొన్నారు. 13 పంచాయతీల డ్వాక్రా సంఘాల సభ్యులు, మండల ప్రజాప్రతినిధులు హాజరు కావాలని కోరారు.